క్లుప్తంగా

తాళ్లూరు ఎంపీడీవోగా సత్యం


సత్యం

తాళ్లూరు: ఎంపీడీవోగా సానికొమ్ము సత్యం గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పని చేసిన దారా హనుమంతురావు అనారోగ్యంతో సెలవులపై వెళ్లారు. దీంతో సత్యానికి ఎంపీడీవో (ఎఫ్ఏసీ) బాధ్యతలు అప్పగించారు. గతంలో కూడా ఆయన ఎంపీడీవో (ఎఫ్ఏసీ)గా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ముందుకు తీసుకెళ్తానన్నారు.

పీజీ నీట్‌లో దర్శి విద్యార్థికి 2,363వ ర్యాంక్


వంశీకృష్ణారెడ్డి (ఫైల్)

దర్శి: మండలంలోని అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన ఇరుగుల వెంకట వంశీకృష్ణారెడ్డికి పీజీ నీట్‌లో ఆల్ ఇండియా 2,363 ర్యాంక్ వచ్చింది. ఈ నెల 19న రిలీజైన నీట్ ర్యాంక్‌లో స్టేట్ ర్యాంక్ 117 సాధించాడు. వంశీకృష్ణారెడ్డి తండ్రి రమణారెడ్డి వ్యవసాయం చేస్తుంటాడు. తల్లి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్నారు. విద్యార్థిని పలువురు అభినందించారు.

రైతులకు యూరియా పంపిణీ


యూరియా పంపిణీ చేస్తున్న ఏఓ సంపత్‌కుమార్

కురిచేడు: రైతులకు మెటా డీఏపీ, యూరియాను మండల వ్యవసాయాధికారి సంపత్‌కుమార్ గురువారం పంపిణీ చేశారు. మండలంలోని కల్లూరులో రైతులకు మెటా డీఏపీ, యూరియా గురించి ఆయన వివరించారు. మన గ్రోమోర్ ఏరియా మార్కెటింగ్ మేనేజర్ గోపి, స్థానిక గ్రోమోర్ మేనేజర్ వేముల వెంకటాద్రితో కలిసి ఆయన రైతులతో మాట్లాడుతూ మెటా డీఏపీ, యూరియా వాడితే అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. అవసరమైన వారికి మన గ్రోమోర్ కేంద్రంలో మెటా డీఏపీ, యూరియా అందుబాటులో ఉందని, పంటల సాగులో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సావిత్రి పేర్కొన్నారు. కళాశాలకు సంబంధించి బీఏ (పొలిటికల్ సైన్స్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ (ఫిజిక్స్), బీఎస్సీ (బోటనీ) కోర్సులు అందుబాటులో ఉన్నట్లు ఆమె తెలిపారు. పూర్తి వివరాలకు కోసం 63037 94980 నంబర్‌కు కాల్ చేయాలని ఆమె సూచించారు.

సీపీఐ బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు

త్రిపురాంతకం: సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు, కార్యర్తలు స్థానికంగా గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్, బ్యాంక్ సెంటర్, మన గ్రోమోర్ కేంద్రం, యర్రగొండపాలెం రోడ్డు ప్రాంతాల్లో బైక్ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కేవీవీ ప్రసాద్, డి.శ్రీనివాస్, బి.రామయ్య, మల్లికార్జున్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి



ర్యాలీ చేస్తున్న కార్మికులు

తాళ్లూరు: ప్రభుత్వ రంగాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్స్‌కు కొన్నేళ్లుగా వేతనాలు పెంచలేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు అన్నారు. మండల కేంద్రం తాళ్లూరులో గురువారం ఆ సంస్థ మూడో మహాసభ అంగన్‌వాడీల నాయకురాలు కె.విశ్వవాణి, సుషన్న అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నాయని, పెరిగిన ధరలకు అనుగుణంగా స్కీం వర్కర్స్కు, కార్మికులకు వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు బోడపాటి హనుమంతురావు పాల్గొన్నారు.

నడి రోడ్లపై మూగజీవాలు

- ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న ఆవులు
- యజమానుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం
- గోశాలలకు తరలించాలని కోరుతున్న వాహనదారులు


రోడ్డుపై సంచరిస్తున్న ఆవులు

పెద్దదోర్నాల: అవి నోరు లేని మూగజీవాలు. నిత్యం నడి రోడ్లపై తిరుగుతూ వాహనదారులు, పాదచారులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. పట్టించుకోవాల్సిన యజమానులు పత్తా లేకుండా వాటిని రోడ్లపైనా వదిలేశారు. బాధ్యత తీసుకోవాల్సిన అధికారులు ముఖం చాటేశారు. దీంతో నోరు లేని ఆ మూగజీవాలతో వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడటంతో పాటు పలు ప్రమాదాలకు గురవుతున్నారు. మండల కేంద్రంలో ఆవులు, ఆవు దూడలు, ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా రోడ్లనే నివాసాలుగా చేసుకుని కాలం గడుపుతున్నాయి. ఆవుల సంచారంతో అటుగా వెళ్తున్న పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు, లారీలు వంటి వాటితో రోడ్లపై సంచరించే మూగజీవాలు కూడా ప్రమాదాలు ఎదుర్కొంటున్నాయి. ఒక్కోసారి వీటి సంచారంతో ప్రధాన వీధుల్లో ట్రాఫిక్ కూడా తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మండల కేంద్రంలోని శ్రీశైలం రోడ్డు, కర్నూల్, గుంటూరు రహదారుల్లో వీటి సంచారం అధికంగా ఉంటుంది. ఆయా రహదారుల్లో వాహనదారులు తిని పడేసిన అల్పాహారం, తినుబండారాల పొట్లాల కోసం ఎక్కువగా మూగజీవాలు రోడ్లపైనే సంచరిస్తున్నాయి. దీనికి తోడు వాటి యజమానులు సైతం రోడ్లపైనే వాటికి కావాల్సిన ఆహారాన్ని అవే సేకరించుకుంటున్నాయన్న కారణంతో వాటిని పట్టించుకోవటం మానేశారు. ఈ క్రమంలో ఆయా రహదారుల్లో వచ్చి పోయే వాహనాలను అవి గమనించక పోవడంతో ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో శ్రీశైలం రహదారిలో ఎందరో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. మండలంలో చాలా మంది మూగజీవాల యజమానులు వాటిని రోడ్లపైనే వదిలేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్లపై సంచరిస్తూ, యజమానుల నిరాదరణకు గురైన మూగజీవాలను అధికారులు గుర్తించి పెద్దదోర్నాలకు సమీపంలో ఉన్న శ్రీశైలం పుణ్యక్షేత్రంలోని ట్రస్టులు, ఆలయాలు, గోశాలలకు వాటిని అప్పగించాలని కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్


గణపవరంలో ఎమ్మెల్యే తాటిపర్తికి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

త్రిపురాంతకం: గ్రామీణ ప్రజలు, రైతుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. గురువారం ఆయన మండలంలోని గణపవరం వచ్చిన సందర్భంగా ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలో అభివృద్ధి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించారు. ప్రజల సమస్యలు పరిష్కరించని ప్రభుత్వం.. గతంలో వైఎస్సార్ సీపీ ఇచ్చిన పింఛన్లను సైతం తొలగించడం దారుణమన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అందించే వివిధ రకాల పింఛన్లను తొలగించడం చూస్తే ఈ ప్రభుత్వానికి పేదల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. తొలగించిన పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేసారు. అదే విధంగా గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయన్నారు. ప్రజల సమస్యలు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుని ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. సాగర్ రైతులు సాగు నీటి కోసం ఎదురు చూస్తున్నారని, సకాలంలో నీటిని విడుదల చేసి ఉంటే వరి నారుమళ్లు ఇప్పటికే పోసుకునే వారని పేర్కొన్నారు. సాగర్ చివరి ఆయకట్టు వరకు నీరందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుని సకాలంలో ఖరీఫ్ సాగుకు నీరందించాలన్నారు. రైతులు ఎరువులు దొరక్క అధిక ధరలు చెల్లించాల్సి వస్తోందన్నారు. గతంలో ఎరువుల కోసం రైతులు క్యూ లైన్‌లో నిలబడే అవసరం లేకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిందన్నారు. అవసరమైనన్ని ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. మార్కెట్‌లో ఎరువుల కొరత ఏర్పడితే రైతులు తీవ్రంగా నష్టపోతారని, అధికారులు దీనిపై దృష్టి సారించి ఎరువులు సకాలంలో అందించాలని ఎమ్మెల్యే తాటిపర్తి కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు మాకం జాన్‌పాల్, మండల పార్టీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, బీసీ సంఘ నాయకుడు మురారి గాలెయ్య, స్థానిక నాయకులు ఉన్నారు.

పాలనలో కూటమి ప్రభుత్వం విఫలం


పెద్దారవీడు: క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణారెడ్డి


పుల్లలచెరువులో..


పెద్దదోర్నాలలో..

పెద్దారవీడు: పరిపాలనలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలో తోకపల్లి, ఏనుగులదిన్నెపాడు, గొబ్బూరు గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓట్ల కోసం ప్రజలను వంచించి గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు ఏడాది పాలన పూర్తి చేసుకున్నా నేటికీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి హామీని అమలు చేశారని గుర్తు చేశారు. ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు ముందు ఉంటారన్నారు. గత వైఎస్సార్ సీపీ పాలన, ఇప్పటి కూటమి పాలనలో తేడాను ప్రజలు గుర్తించి నిలదీయాలని సూచించారు. ఎన్నికల సమయంలో నెరవేరని హామీలు ఇచ్చి తీరా అధికారం చేపట్టాక అన్ని వర్గాల వారిని మోసం చేసిన చంద్రబాబు మోసపూరిత పాలనను కలిసికట్టుగా తిప్పికొడదామని పిలుపునిచ్చారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ నూర్ అహ్మద్, సర్పంచ్‌లు జిల్లెల మల్లేశ్వరి, అంగిరేకుల ఆదినారాయణ, బలుసుపాటి లూథియా, మాజీ ఎంపీటీసీ వెన్నా పెద్దపోలిరెడ్డి, మాజీ సర్పంచ్ ఇజ్రాయిల్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, పోటు శ్రీను, నాయకులు సొంటి నాగార్జునరెడ్డి, నరాల తిరుమలనారాయణ, బలుసుపాటి నాగరాజు, యూత్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుల్లలచెరువు: కూటమి పాలనలో ప్రజలు అన్ని విధాలా మోసపోయారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ సెక్రటరీ బి.సుబ్బారెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి రాములు, రాష్ట్ర మహిళా కార్యదర్శి ఉడుముల అరుణ అన్నారు. గురువారం మండలంలోని కవలకుంట్ల, పీవీపల్లి పంచాయతీల్లో జిల్లా కార్యవర్గ సభ్యుడు దోమకాలు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, ప్రజలను వైఎస్సార్ సీపీ నేతలు కలుస్తూ కూటమి పాలనతో అందిన సౌకర్యాలు, పథకాల అమలు తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబాలకు ఆర్థికంగా కలిగిన లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. దీనిపై ప్రజలు తమకు ఆర్థిక ప్రయోజనం కలిగించే పథకాలు అందడం లేదన్నారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా అభిప్రాయాలు కోరారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాగైనా గెలవడం కోసం కూటమిగా ఏర్పడి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై లేని పోని ఆరోపణలు చేశారన్నారు. అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించి ఓట్లు వేసిన ప్రజలను మోసం చేశారన్నారు. ప్రజల సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.2.70 లక్షల కోట్లు నేరుగా ప్రజల ఖాతాల్లో జమ చేసిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు ఎన్నో కొర్రీలు వేస్తూ సంక్షేమం సాధ్యం కాదని మాయ మాటలు చెబుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘు, సర్పంచ్‌లు సత్యనారాయణరెడ్డి, కోటిరెడ్డి, రమణారెడ్డి, మస్తాన్‌రెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, లక్ష్మానాయక్, బ్రహ్మారెడ్డి, ఎల్.ప్రసాద్, శ్రీనివాసరావు, పోలిరెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: మండల పరిధిలోని వై.చర్లోపల్లి, చిలకచర్ల, కొత్తూరు, గంటవానిపల్లెలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో అల్లు రాంభూపాల్‌రెడ్డి, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

శాంతిభద్రతల బాధ్యత నిర్వాహకులదే..


మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

పొదిలి: వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసుకునే మండపాల వద్ద శాంతి భద్రతలకు విఘాతం కలిగితే నిర్వాహకులే బాధ్యత వహించాలని సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం రాత్రి స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఎస్సై వేమనతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని తెలిపారు. విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవడంతోపాటు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఊరేగింపు, నిమజ్జన సమయాలను పోలీస్ శాఖకు ముందుగా తెలియజేయాలన్నారు. శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలని కోరారు.

మండపాల వద్ద గొడవలు చేస్తే సహించం

కొమరోలు: వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్సై నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహం ఏర్పాటు చేసే ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద గొడవలు చేస్తే సహించేది లేదని, వివాదాలకు ఉద్దేశపూర్వకంగా రాజకీయ రంగు పులిమి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

చెన్నకేశవస్వామి సన్నిధిలో జిల్లా అదనపు న్యాయమూర్తి పూజలు

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో గురువారం ఒంగోలు రెండో అదనపు జిల్లా జడ్జి పి.లలిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలకగా, అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందించి, స్వామివారి శేష వస్త్రాలు బహూకరించారు. న్యాయమూర్తి వెంట ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

నిబంధనలు పాటించని మద్యం దుకాణాలపై చర్యలు

ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషా బేగం

మార్కాపురం: మద్యం అధిక ధరలకు విక్రయించినా, నిబంధనలకు వ్యతిరేకంగా షాపులు నిర్వహించినా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషా బేగం హెచ్చరించారు. గురువారం మార్కాపురం ఎక్సైజ్ కార్యాలయంలో ఆమె షాపుల ఓనర్లు, ఆశావహులతో సమావేశం నిర్వహించారు. మార్కాపురం మున్సిపాలిటీలో ఏర్పాటు చేయనున్న 7 నూతన బార్లలో 5 ఓపెన్ కేటగిరీ, 2 గీత కులాలకు కేటాయించినట్లు వివరించారు. సమావేశంలో ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

దర్శి యువకునికి నేషనల్ యూత్ ఎక్స్‌లెన్సీ అవార్డు


అవార్డు అందుకుంటున్న సాయి శ్రీహరి ప్రవీణ్

దర్శి: జమ్మూ కశ్మీర్‌కు చెందిన లైవ్ ఫర్ అదర్స్ బింగ్ హెల్ప్ ఫుల్ ఫౌండేషన్ సంస్థ దేశ వ్యాప్తంగా సామాజిక, సోషల్ వర్క్ చేస్తున్న వారిని గుర్తించింది. నేషనల్ యూత్ ఎక్స్‌లెన్సీ అవార్డుకు పట్టణానికి చెందిన వి.సాయి శ్రీహరి ప్రవీణ్ ఎంపికయ్యారు. బుధవారం జమ్మూ కశ్మీర్‌లోని జమ్మూ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో అక్కడి మాజీ డీఐజీ ఎస్పీ వైద్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. తనకు అవార్డు అందించిన సంస్థ ప్రతినిధులకు సాయి శ్రీహరి ప్రవీణ్ ధన్యవాదాలు తెలిపారు. సాయి శ్రీహరి ప్రవీణ్ నెహ్రూ యువ కేంద్రంలో జాతీయ వలంటీర్‌గా, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్‌గా, ఎన్ఎస్ఎస్, యూఎన్‌వీ, పలు రాష్ట్ర జాతీయ స్థాయి వలంటీర్ సంస్థల కార్యక్రమాలు నిర్వహించడాన్ని గుర్తించి ఈ అవార్డు అందజేశారు.

వినాయకుని మండపాలకు అనుమతి తప్పనిసరి

పెద్దారవీడు: వినాయకచవితి మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్ఐ సాంబశివయ్య సూచించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ వినాయకుని ఉత్సవాల సందర్భంగా ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. పోలీసుల అనుమతి కోసం మండపం ప్రదేశం, నిమజ్జనం తేదీ, నిమజ్జనం ప్రదేశం, తదితర వివరాలతో పోలీస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పోలీసు శాఖ సూచించిన నిబంధనలను పాటించాలని, చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయకుని మండపం వద్ద లేక ఊరేగింపు సమయంలో బాణసంచా పేల్చొద్దని, రాత్రి సమయంలో మండపం వద్ద ఒక వలంటీర్ తప్పనిసరిగా ఉండి అక్కడి పరిస్థితులను పరిశీలిస్తూ ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, మండపాల వద్ద సీసీ కెమెరాలు, అగ్నిప్రమాద నివారణ చర్యగా నీటి బక్కెట్లు, ఇసుక బస్తాలు వంటి భద్రత చర్యలు చేపట్టాలని చెప్పారు.

గణపతి నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలి


విలేకరులతో మాట్లాడుతున్న సీఐ హసన్

త్రిపురాంతకం: గణపతి నవరాత్రుల సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసే గణేష్ ఉత్సవ కమిటీలు ఆన్‌లైన్ పోర్టల్లో అనుమతులు పొంది ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ అసాన్, ఎస్ఐ శివబసవరాజు కోరారు. గురువారం స్థానిక తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. ప్రతి మండపం వద్ద ఐదుగురితో కమిటీగా ఏర్పడి గణపతి నవరాత్రులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుపుకోవాలన్నారు. ఆన్‌లైన్ పోర్టల్ గణేష్ ఉత్సవ కమిటీ 2025 ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. విలున్నంత వరకు మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆలయాల వద్ద, గ్రామ కూడళ్ల వద్ద ఏర్పాటు చేసుకోవడంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా ప్రైవేటు స్థలాల్లో పందిళ్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

నాణ్యతకు మారుపేరు భారతి సిమెంట్


భారతి సిమెంట్ గురించి వివరిస్తున్న డిప్యూటీ మేనేజర్ సుబ్బారెడ్డి

పుల్లలచెరువు: నాణ్యతకు మారు పేరుగా భారతి సిమెంట్ ప్రస్తుతం మార్కెట్‌లో ఉందని ఆ సంస్థ డిప్యూటీ మేనేజర్ ఎన్‌వీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక భారతి సిమెంట్ డీలర్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ నాణ్యతలో ఏ సిమెంట్ ఇవ్వని గట్టి నమ్మకాన్ని భారతి సిమెంట్ ఇస్తోందన్నారు. క్వాలిటీలో రాజీ లేకుండా జర్మనీ రోబో టెక్నాలజీతో తయారు చేసిన సిమెంట్ భారతి సిమెంట్..అని అన్నారు. మూడు రెట్లు బెటర్‌గా సిమెంట్ పనిచేస్తుందని చెప్పారు. తాపీమేస్త్రీలకు భారతి సిమెంట్ కంపెనీ ద్వారా లక్ష రూపాయల బీమా సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. దీనిని గ్రామాల్లో ఉన్న మేస్త్రీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టెక్నికల్ ఆఫీసర్ సాంబశివారెడ్డి, డీలర్లు యల్లారెడ్డి, శ్రీనివాసరావు, రామారావు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై విద్యార్థులకు అవగాహన


హెచ్ఐవీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హెచ్ఐవీపై గురువారం అవగాహన కల్పించారు. హాండ్స్ ఆఫ్ కంపషన్ స్వచ్ఛంద సేవా సంస్థ, ఏపీ సాక్స్, డిస్ట్రిక్ట్ ఎయిడ్స్ ప్రివెన్షన్ కంట్రోల్ యూనిట్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించినట్లు ప్రాజెక్టు మేనేజర్ బ్రహ్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ వ్యాప్తి చెందే నాలుగు మార్గాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపరాదని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్న, భవాని, రాణి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సాయం


నిత్యావసరాలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

దర్శి: లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ ఆధ్వర్యంలో పొదిలి రోడ్డులోని కోర్టుకు వెళ్లే దారిలో నివాసం ఉన్న రోజువారీ కూలి పనులు చేసుకునే ఒక నిరుపేద కుటుంబంలోని కుటుంబ పెద్ద ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ క్లబ్ సభ్యుల సహకారంతో ఆయన కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసరాలు అందించారు. 25 కిలోల బియ్యం, వంటనూనె, కందిపప్పు, బెల్లం, చింతపండు, ఉల్లిపాయలు, కొబ్బరినూనె, పండ్లు ఇచ్చారు. గ్యాట్ మార్కెటింగ్ కో ఆర్డినేటర్ కల్లూరి విద్యాసాగర్‌రెడ్డి, క్లబ్ సెక్రటరీ పీవీ సత్యనారాయణ గుప్తా, ట్రెజరర్ గుడిపాటి అశోక్, క్లబ్ సభ్యులు ధనిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాశీంసాహెబ్, బిజ్జం నాగార్జునరెడ్డి, గువ్వల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.